క్లుప్తంగా

నేడు కేయూలో ఎన్‌పీఎస్‌పై ఓరియెంటేషన్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల కోసం ఈనెల 23న మధ్యాహ్నం క్యాంపస్‌లోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో నేషనల్ పెన్షన్ స్కీంపై ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి ఏపీలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉదయభాస్కర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూనివర్సిటీ ఉద్యోగుల ఆర్థిక ప్రణాళిక, పదవీ విరమణ సంసిద్ధత పెంపొందించే లక్ష్యంతో ఉదయభాస్కర్ నేషనల్ పెన్షన్ స్కీంపై విలువైన సమాచారాన్ని అందజేస్తారని తెలిపారు. ప్రోగ్రాం కన్వీనర్లుగా కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి, కేయూ ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ కోర్నెలు వ్యవహరిస్తారని వివరించారు.

గ్రూప్ -2 అభ్యర్థులకు మాక్ టెస్ట్



హన్మకొండ చౌరస్తా: ఫైన్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో గ్రూప్ -2కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రాండ్ మాక్ టెస్ట్ సిరీస్‌ను ఆదివారం నిర్వహించారు. సుమారు 300 మంది గ్రంథ పాఠకులు పరీక్ష రాసినట్లు ఇన్‌స్టిట్యూట్ బాధ్యుడు సయ్యద్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో మాక్ టెస్ట్ సిరీస్ నిర్వహించినట్లు వివరించారు. మాక్ టెస్ట్ పర్యవేక్షణలో డిప్యూటీ లైబ్రేరియన్ కరుణకుమారి, గ్రేడ్ -2 లైబ్రేరియన్ పురుషోత్తం, ఇంటర్ నెట్ సెక్షన్ ఇన్‌చార్జ్ రాజేష్, ఇన్‌స్టిట్యూట్ బాధ్యులు సురేష్, గణేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఫొటోగ్రాఫర్‌కు సన్మానం



న్యూశాయంపేట: నగరానికి చెందిన ప్రముఖ ఉర్దూ దినపత్రికకు చెందిన ఫొటోగ్రాఫర్ మొహమ్మద్ ముషూక్‌కు హమ్ ఖాయల్ – ఏ – వరంగల్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. వరంగల్ ఎల్‌బీనగర్ గోల్డెన్ గెస్ట్ హౌస్‌లో ఎస్ఎం సయ్యద్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాషుక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు మొహమ్మద్ అయూబ్, అజీజ్ చాంద్ పాషా, వహీద్గులషన్, అక్బర్ జియా, ఎంఏ నయీం, అలీం దానిష్, హబీబుద్దీన్, అక్తర్ హుస్సేన్, రియాజ్, జాఫర్, లతీఫ్, నిజాం, మునవర్, తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్ అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ బీఆర్‌నగర్ కాలనీకి చెందిన కారు డ్రైవర్ జలాల్ మహ్మద్ అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. సీఐ కథనం ప్రకారం మహబూబాబాద్‌కు చెందిన జలాల్ అహ్మద్, కరిష్మా దంపతులిద్దరు బతుకు దెరువు నిమిత్తం వరంగల్ ఉర్సుగుట్ట బీఆర్‌నగర్‌కు ఏడు నెలల క్రితం వలస వచ్చారు. కారు నడుపుతూ జలాల్ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కారు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోతున్నాని తండ్రి సయ్యద్ అన్వర్ ఫోన్‌కు వాట్సాప్‌కు మెసేజ్ పెట్టి ఆదివారం ఉదయం కారులో ఇంటి నుంచి మహ్మద్ వెళ్లిపోయాడు. సాయంత్రమైన తిరిగి ఇంటికి రాలేకపోవడంతో తండ్రి అన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరించారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌కు పలువురి పరామర్శ



ఖిలా వరంగల్ / హన్మకొండ: వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం పెరకవాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సోదరుడు నన్నపునేని రవీందర్ శనివారం అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, తదితరులు ఆదివారం పరామర్శించారు. రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, దొనికెల మల్లయ్య, జున్ను రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో వీధి కుక్కల స్వైరవిహారం

- సంరక్షణ కేంద్రాలకు తరలిస్తున్నా తగ్గని శునకాల సంఖ్య
- గుంపులుగా దాడులతో భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని బల్దియా అధికారులు



ఖిలా వరంగల్ సత్యసాయినగర్‌లో రాత్రివేళ సంచరిస్తున్న కుక్కలు



హసన్‌పర్తి: పగటి వేళలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ నాయుడు పెట్రోల్ బంక్ సమీపం సత్యసాయినగర్, వేంకటేశ్వర కాలనీల్లో వీధి కుక్కల సంచారం అధికమైంది. వాటి సంఖ్య నానాటికి పెరుగుతోంది. వాటి దాడిలో చిన్నారులు, వృద్ధులు అధికంగా గాయాలపాలవుతున్నారు. చీకటి పడితే ఎటువైపు నుంచి దాడి చేస్తాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. దాంతో రాత్రయితే వీధుల్లోకి రావడానికి ప్రజలు జంకుతున్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలేవి?

బల్దియా చేపడుతున్న వీధికుక్కల నియంత్రణ అంతంత మాత్రంగానే ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాటి అరుపులకు నిద్ర పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. బాటసారులతో పాటు వాహనదారుల వెంటపడి మరీ దాడి చేస్తున్నాయి. వాటి దాడులకు భయపడి రాత్రి సమయాల్లో కర్ర వెంట పెట్టుకుని రోడ్డుపైకి వస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదిరోజుల క్రితం ఈ డివిజన్‌లో ఇద్దరిపై వీధికుక్కలు గాయపర్చాయి. ఓ మహిళ గుడికి వెళ్లి ఇంటికి వెళ్తుండగా ఓ వీధికుక్క దాడి యత్నిస్తుండగా ఆమె పెద్దగా అరవడంతో స్థానికులు వెళ్లి ఆమెను కాపాడారు. రెండు నెలల్లో కుక్క కాటుకు గురైన బాధితులు పదుల సంఖ్యలోనే ఉంటారని స్థానికులు చెబుతున్నారు. కుక్కల నియంత్రణకు బల్దియా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వీధికుక్కల బెడదను అరికట్టాలి



కాలనీలో వీధికుక్కల సంచారం ఎక్కువగా ఉంది. రాత్రి వేళలో గుంపులుగా మాటువేసి దాడి చేస్తున్నాయి. చేతిలో కర్ర లేనిదే ఇంట్లో నుంచి బయటకు రాలేకపోతున్నాం. పాఠశాలకు వెళ్లే పిల్లలపై దాడి చేస్తున్నాయి. బాటసారులతో పాటు వాహనదారులను గాయపరుస్తున్నాయి. వీధికుక్కల అరుపులతో రాత్రివేళలో నిద్ర పట్టడం లేదు. వీధికుక్కలను పట్టుకుని సంరక్షణ కేంద్రాలకు తరలించాలి.

– నాగబడి శ్రీనివాస్ గుప్తా, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు

కుక్కల బెడద.. నిత్యం వ్యథ

- మాటు వేసి పిల్లలు, వృద్ధులపై దాడులు
- భయాందోళనలో ప్రజలు

హసన్‌పర్తి: నగరంలోని 1, 65, 66వ డివిజన్లలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఎదురవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన కోళ్ల వ్యర్థాలు పడేస్తున్నారు. వాటిని తినేందుకు అలవాటు పడిన పిచ్చికుక్కలు, ఊరకుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. 66వ డివిజన్ పరిధిలోని హసన్‌పర్తి ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒకటో డివిజన్ ఎర్రగట్టు, చింతగట్టు క్యాంపు, ప్రాంతాల్లోని ఎస్సారెస్పీ కాల్వల ఇరువైపులా కోళ్ల వ్యర్థాలు తినడానికి వచ్చిన కుక్కలు ఆ ప్రాంతంలో కనిపించిన వారిని వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. 65వ డివిజన్ ఎల్లాపురం, దేవన్నపేట, చింతగట్టు క్యాంపు ప్రాంతాల్లో గజ్జి కుక్కలు స్వైర విహారం చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవి ఇళ్లల్లోకి చొరబడి తిష్టవేస్తున్నాయని వాపోతున్నారు. నెల రోజుల్లో ఇద్దరిపై కుక్కలు చేశాయని స్థానికులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం

కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానిక అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారులు, కాలనీల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నా చర్య తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి.

ఆత్మీయత.. ఆనందం.. ఆరోగ్యం

- సంబురాలు జరుపుకున్న మహిళా వాకర్స్ గ్రూప్ సభ్యులు



వేడుకలో పాల్గొన్న గ్రూప్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: రాగద్వేషాలు లేకుండా అన్యోన్యంగా కలిసిమెలిసి పరస్పరం మనోధైర్యాన్ని నింపుకుని ఆత్మీయతను పంచుకుని, ఆనందంగా వేడుకలు జరుపుకుని, ఆప్యాయంగా పలకరించుని మహిళా గ్రూపు సభ్యులు సంబురాలు నిర్వహించుకున్నారు. వరంగల్ ఏవీవీ జూనియర్ కళాశాల లేడీస్ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని వరంగల్ హంటర్‌రోడ్‌లో కుసుమ వాసవిదేవి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు మహిళలందరూ ఒకచోట చేరి ఆటపాటలతో, కేక్ కట్‌చేసి ఘనంగా వేడుక జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవిదేవి, అరుణ, రంగమణి, ప్రభ, గీత, హరిత, మంజుల, విజయలక్ష్మి, కరుణ, గీత, శైలజ, స్వాతి, పుష్ప, సంధ్య, రమాదేవి, తులసి, రజిని, తదితరులు పాల్గొన్నారు.



బంధువులకు దోచిపెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ గౌడ్

నయీంనగర్: బంధువులకు దోచిపెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌దేనని, బంధువులకు ఆశ్రిత పక్షపాతం పేటెంట్ హక్కులు ఆ పార్టీకే ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకం అమృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సృజన్‌రెడ్డి ఇంతకుముందు కేటీఆర్ దగ్గర కూడా పనిచేశారని, కేటీఆర్‌కు ఉన్న బినామీల్లో సృజన్ రెడ్డి ఒకరని ఆరోపించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రహస్య మిత్రులు అనడానికి కవితకు బెయిల్ రావడమే నిదర్శనమని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ అమలు చేస్తోందని, రైతు రుణమాఫీ రానివారి కోసం సర్వే చేసి రుణమాఫీ చేయనున్నట్లు వివరించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

కార్మికుల ముట్టడిని విజయవంతం చేయాలి

హన్మకొండ: కార్మిక కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. హనుమకొండ వడ్డెపల్లిలోని తన స్వగృహంలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. కార్మికుల ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.1లక్షకు పెంచాలని కోరారు. సమావేశంలో బీఆర్‌టీయూ, టీబీఎస్‌ఆర్‌కేఎస్ నాయకులు ఇంజాల మల్లేశం, నాయిని రవి, తేలు సారంగపాణి, పాలడుగుల శివకుమార్, సిరికొండ భిక్షపతి, పానుగంటి కొండన్న, ప్రసాద్, చార్లెస్ బాబు, శ్యామ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బహిరంగ సభ



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

కాజీపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 20వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రొఫెసర్ బన్న అయిలయ్య పిలుపునిచ్చారు. కాజీపేట భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవాలయం కమ్యూనిటీ హాల్‌లో తేజోమయి మాలకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, అయితే, కులాల ప్రాతిపదికన పూర్తిగా పరిశీలన చేసిన తర్వాతే తుది తీర్పు ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు మర్యాల కృష్ణ అధ్యక్షత వహించగా మాజీ డీఎస్పీ దామెర నర్సయ్య, బండి విజయ్‌కుమార్, కొండ్ర నర్సింగరావు, సీహెచ్.కొమ్మాలు, జంగం బాబురావు, నక్క సుదర్శన్, తండమల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలి

హన్మకొండ కల్చరల్: ఉత్తీర్ణులైన ఫార్మసిస్టులు బాధ్యతగా వ్యవహరించాలని, ఫార్మా ఇండస్ట్రీ, క్లినికల్ ఫార్మసీ విభాగాల్లో అప్రమత్తంగా ఉంటూ అవకాశాలు అందుకొని విజయాలు సాధించాలని వరంగల్ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.సంధ్య అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల స్నాతకోత్సవం గ్రాడ్యుయేషన్ డే -2024ను ఆదివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీదేవి, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రెడ్డి, వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ బీఎస్ శరవణభవ, డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ సీహెచ్ మహేష్, ప్రొఫెసర్ డాక్టర్ పావని, గిరిజ, మాధవి, లక్ష్మీకల్యాణి, రజిని పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో అతిథులు, హెచ్ఓడీలు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీత

ఖిలా వరంగల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ అచ్చ లక్ష్మీవీరేష్‌బాబు, స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ తూర్పుకోటలో డాక్టర్ అచ్చ వరణ్‌బాబు, డాక్టర్ సునీత (తిప్పని) ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బోగి సురేష్, సంగరబోయిన చందర్, ఎల్లయ్య, బోయిని దూడయ్య, కందిమల్ల మహేష్, చింతం రమేష్, రాజు, మోహన్, సాయి, కవిత, రజిత, స్వర్ణలత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాశిబుగ్గ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ గుర్తుచేశారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆర్పీఎఫ్ బ్యారెక్, కాలనీల్లో పరిసరాలను ఆదివారం శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వృక్షాలను తాము రక్షిస్తే అవి తమను రక్షిస్తాయని చెప్పారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఎస్సై, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్బిట్’ విద్యార్థుల ప్రతిభ



హసన్‌పర్తి: త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో హసన్‌పర్తి మండలం ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ టెక్నో స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన ఎం.వినీత్‌రెడ్డి ప్రథమ బహుమతి, స్నేహారెడ్డి ద్వితీయ బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతికి రూ.6వేలు, ద్వితీయ బహుమతికి రూ.3వేలు నగదు పురస్కారంతో పాటు ప్రశంస పత్రాన్ని త్రిదండి చిన్నజీయర్ స్వామి నుంచి విజేతలు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హారికారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా భగీరథ గుంతలు

రోడ్డు తవ్వి వదిలేసిన అధికారులు



ఖిలా వరంగల్: వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం అంతర్గత రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వారు. పైపులైన్ వేసి అనంతరం సరిగా పూడ్చకుండా గుంతలను అలాగే వదిలేశారు. దాంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నారు. బాటసారులు, వాహనదారులు గుంతల్లో పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ప్రమాదంగా ఉన్న గుంతలను పూడ్చాలని వేడుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ సభ్యత్వాలకు ఆదరణ



దేశాయిపేట: బీజేపీ సభ్యత్వం కోసం ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. 21వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో సభ్యత నమోదును ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సభ్యత నమోదుకు ఇంటింటికి వెళ్తుంటే స్వచ్ఛందంగా ప్రజలే నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ పార్టీ సభ్యత్వం తీసుకుంటున్నారని వివరించారు. జిల్లా సభ్యత్వ ప్రముఖ్ కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రాణా ప్రతాప్, డివిజన్ అధ్యక్షుడు కోమాకుల నాగరాజు, గోవింద్‌సింగ్, సిద్దోజు శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్, అపురూప సాయి, అరుణ్ సాయి, గాదె అఖిల్, చింతం రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సర్దుబాటు జీఓను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ హనుమకొండ జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెబుతూనే ప్రపంచ బ్యాంకు షరతుల మేరకు పనిచేస్తూ విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేసేలా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ అశాస్త్రీయంగా ఉందన్నారు. జీఓ నంబర్ 25 ప్రకారం 60మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లే ఉండాలంటే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ముత్యాల రఘుపతి, జిల్లా జనరల్ సెక్రటరీ గొడిశాల సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం బాధ్యులు బిల్లా సుబ్బారావు, జయప్రకాశ్, గొడిశాల రమేష్, చంద్రగిరి లక్ష్మయ్య, ఇప్పకాయల కుమారస్వామి, లక్ష్మణ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సమాధులు కూల్చిన వారిపై అట్రాసిటి కేసు పెట్టాలి



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డ దళితుల సమాధులను కూల్చివేసిన దుండగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కింద కేసు నమోదు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. పెద్దమ్మగడ్డ శివారులో ధ్వంసమైన శ్మశానవాటికను సీపీఎం ఉత్తర మండల కమిటీ కార్యదర్శి గాదె రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా బొట్ల చక్రపాణి మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ భూములు రోజురోజుకు ఆక్రమణకు గురవుతున్నాయని వాపోయారు. 1971లో నల్లెల్ల కట్టయ్య తన నాలుగు ఎకరాల భూమిని శ్మశాన వాటికకు రాసిచ్చారని గుర్తుచేశారు. ఆ స్థలంపై కన్నుబడిన కిషన్ రాజ్, ప్రభాకర్‌జ్యోతి, తదితరులు తప్పుడు కాగితాలు సృష్టించి కోర్టులో కేసు వేసి సమాధులను కూల్చివేయడం దుర్మార్గమని విమర్శించారు. వారిపై అటాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, మంద మల్లేషం, బొట్ల కుమారస్వామి, స్థానికులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగులు

హన్మకొండ: సమాచార, పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని హనుమకొండ సుబేదారి వడ్డెపల్లి రోడ్డులోని శ్రీమాత బాంక్వెట్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ పూర్వ సంచాలకుడు బి.రాజమౌళి పాల్గొని మాట్లాడారు. ఉద్యోగరీత్యా దీర్ఘకాలం సేవలు అందించి విశ్రాంత జీవితం గడుపుతున్న విశ్రాంత ఉద్యోగులు ఆత్మీయ సమ్మేళనంతో ఒకచోట కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో రిటైర్డ్ ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు కొనసాగడంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమం.. ఇతర జిల్లాలకు మార్గదర్శకం అవుతుందని వివరించారు. విశ్రాంత అధికారులు భాస్కర్, ముర్తుజా, వెంకటనారాయణ, మల్లయ్య, ఇమ్మానుయేల్, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, సారయ్య, విధుమౌళి, సుధాకర్, దేవేందర్ రెడ్డి, సుదర్శన్, కట్టయ్య పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ద్విచక్ర వాహనంతో ఓ మహిళను ఢీకొట్టి తీవ్ర గాయాలపాలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన మైదం వజ్రమ్మ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. ఈనెల 20వ తేదీ సాయంత్రం డ్యూటీ ముగించి ఇంటికి కాలినడకన బయలుదేరగా పడమరకోట పూర్ణచందర్ హోటల్ వద్ద హుజురాబాద్ మండలం పెద్దపాపయ్య గ్రామానికి చెందిన గిసిడి రాజు తన బైక్‌తో ఆమెను ఢీకొట్టాడు. దాంతో వజ్రమ్మకు తీవ్ర గాయాలు కాగా, బాధితురాలి భర్త మైదం జైపాల్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.